బాచుపల్లి నుండి టీ-హబ్ వరకు ఏసీ బస్సులు

మియాపూర్: మియాపూర్ డిపో పరిధిలోని బాచుపల్లి నుండి టీ-హబ్‌కు ఏసీ బస్సులను నడుపుతున్నట్లు మియాపూర్ -2 డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. బాచుపల్లి, రాజీవ్ గాంధీ నగర్, నిజాంపేట్, నిజాంపేట్ ఎక్స్ రోడ్డు, జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీ ఎంబిజీ, ఫోర మాల్, మలేషియన్ టౌన్‌షిప్, కేపీహెచ్‌బీ - 4 పేజ్, చంద్రానాయక్ తండా, సైబర్ టవర్స్, టీసీఎస్ రాయదుర్గం మెట్రో, మైండ్ స్పేస్ మీదుగా టీ - హబ్‌కు ఏసీ బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు.

ట్రిపుల్‌ఐటీలో 19న సీడీఐటీహెచ్ ప్రారంభోత్సవం

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ మొదటి సీఈఓగా పనిచేసిన ఫకీర్ చంద్‌కోహ్లీ (ఎఫ్ సికోహ్లీ) దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 19 ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన జయంతిని పురస్కరించుకొని క్యాంపస్‌లోని కోహ్లీ సెంటర్ ఆన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్(కెసీఐఎస్)లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ డిజిటల్ టెక్నాలజీస్ ఇన్ హెల్త్‌కేర్(సీడీఐటీహెచ్)ను ప్రారంభించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. ఈసెంటర్‌ను ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి నాగేశ్వర్ రెడ్డి ప్రారంభించి అనంతరం ప్రత్యేక ఉపన్యాసాన్ని ఇస్తారు.

ప్రజావాణిలో 14 ఫిర్యాదులు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 14 ఫిర్యాదులు అందాయి. టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి 12, ఇంజినీరింగ్, ప్రాపర్టీ ట్యాక్స్ విభాగాలకు సంబంధించి ఒక్కో ఫిర్యాదు వచ్చాయి. కార్యక్రమంలో ఏఎంసీలు ప్రేమ్ కుమార్, శ్రవణ్ కుమార్ రెడ్డి, ఏఎంహెచ్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంటినెంటల్ ఆస్పత్రిలో ఏఐ వైద్యం

రాయదుర్గం: కృత్రిమ మేధతో కాంటినెంటల్ ఆస్పత్రి సరికొత్త ప్రయాణాన్ని ఆరంభించింది. ఎంఎల్‌టీ, మయోక్లినిక్, నెదర్లాండ్స్ సంస్థలతో కలసి నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రి ఏఐను ఉపయోగించుకోనుంది. సోమవారం ఆస్పత్రి ప్రాంగణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఆస్పత్రి చైర్మన్, వ్యవస్థాపకుడు డాక్టర్ గురు ఎన్ రెడ్డి సమక్షంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ ఫణీంద్ర కెయలవర్తితో కలిసి ప్రారంభించారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

చందానగర్: రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ సంఘటన చందానగర్ పరిధిలో చోటు చేసుకుంది. పాపిరెడ్డి కాలనీకి చెందిన కుమార్ (48) ఆర్‌కె ట్రావెల్స్‌లో మినీ బస్ డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల డ్రైవర్ ఉద్యోగం నుంచి తొలగించడంతో మనస్థాపానికి గురై సోమవారం సాయంత్రం పాపిరెడ్డి కాలనీ వద్ద ఉన్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రేపు జేఎన్‌టీయూహెచ్‌లో వర్క్‌షాప్

కేపీహెచ్‌బీకాలనీ: రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల నిర్వాహకులకు 'అవుట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్ అండ్ అక్రిడేషన్' అంశంపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వర్క్‌షాప్ కో ఆర్డినేటర్ గిరిధర్ తెలిపారు. నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్, జేఎన్‌టియుహెచ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ వర్క్ షాప్‌లో వీసీ, ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్‌రెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్, ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, ఎన్‌బిఏ మెంబర్ సెక్రటరీ డాక్టర్ అనిల్ కుమార్, తదితర ప్రముఖులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొంటారన్నారు.

యువకుడు అదృశ్యం

మియాపూర్: మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని బాపూజీనగర్‌కు చెందిన శ్యాం సుందర్ (28) డ్రైవింగ్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 12న స్నేహితుడు సాయికుమార్‌తో కలిసి బయటకు వెళ్లారు. ఆ తరువాత శ్యాం సుందర్‌ను సాయి కుమార్ రాత్రి 11.30 గంటలకు మియాపూర్ బస్ స్టాప్ వద్ద దించివెళ్లాడు. శ్యాం ఇంటికి రాకపోవడంతో మిత్రులు, కుటుంబసభ్యుల వద్ద తండ్రి వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



'సమ్మర్ ప్లాన్' సిద్ధం చేశాం

- ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు
- సాక్షితో దుర్గం చెరువు, హఫీజ్‌పేట్ డివిజన్ల జనరల్ మేనేజర్లు

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



హఫీజ్‌పేట్ 17వ డివిజన్ జలమండలి జీఎం నారాయణ



దుర్గం చెరువు 15వ డివిజన్ జలమండలి జీఎం బ్రిజేష్

చందానగర్: ''వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం .. ఫిబ్రవరి నెల నుంచే భూగర్భ జలాలు ఎండిపోయాయి.. కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాలలో మంచినీటి ట్యాంకర్లు అధికంగా బుకింగ్‌లు జరుగుతున్నాయి.. బుకింగ్‌లు చేసుకున్న వారికి 24 గంటల లోపే ట్యాంకర్‌ను పంపిస్తున్నాం'' అని జలమండలి హఫీజ్‌పేట్, దుర్గం చెరువు డివిజన్ల జనరల్ మేనేజర్లు నారాయణ, బ్రిజేష్ పేర్కొన్నారు. మెరుగైన నీటి సరఫరా కోసం కాలనీలు, బస్తీల్లో మరో నూతన పైప్‌లైన్లు వేస్తున్నామన్నారు. కాలనీలు, బస్తీలకు మరింత చేరువగా ఉండేందుకు కొత్తగా సెక్షన్లను ఏర్పాటు చేశామని వివరించారు. 'సాక్షి' నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రెండు డివిజన్‌లో నీటి కనెక్షన్లు, ట్యాంకర్లతో మంచినీటి సరఫరా తదితర వివరాలను వారు వివరించారు.

◆ మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్న ట్యాంకర్ల సిబ్బంది

హఫీజ్‌పేట్, దుర్గం చెరువు డివిజన్‌లలో వేసవి కాలంలో మంచినీటి కోసం బుకింగ్‌లు సాధారణ రోజులలో 170- 700 వచ్చేవి. ఇప్పుడు 350-1600 ట్యాంకర్ల బుకింగ్‌లు అవుతున్నాయి. వీటి కోసం ట్యాంకర్ల సంఖ్యను పెంచాం. ఫిల్లింగ్ పాయింట్‌లను కూడా పెంచాం.. మూడు షిఫ్టులలో ట్యాంకర్ల సిబ్బంది పనిచేస్తున్నారు. 24 గంటల లోపే మంచినీటి ట్యాంకర్ వినియోదారుడికి పంపిస్తున్నాం. హఫీజ్‌పేట్ 17వ డివిజన్‌లో మంచినీటి కనెక్షన్లు 42,529 ఉన్నాయి. వీటిలో కమర్షియల్ కనెక్షన్లు 1470 ఉన్నాయి. దుర్గం చెరువు 15వ డివిజన్‌లో 42,023 తాగునీటి కనెక్షన్లు ఉండగా కమర్షియల్ కనెక్షన్లు 4200 ఉన్నాయి.

◆ 52868 మంది లబ్ధిదారులు ఉచితంగా నీరు

11 సెక్షన్లు కలిపి మొత్తం 52,868 కనెక్షన్లు కలిగిన లబ్దిదారులకు ఉచితంగా 20వేల లీటర్ల తాగునీరు పొందుతున్నారు. ఉచితంగా మంచి నీరు కావాలంటే మీటర్‌ను బిగించుకోవాలి.



హఫీజ్‌పేట్‌లో ఉన్న దుర్గం చెరువు, హఫీజ్‌పేట్ డివిజన్ల జలమండలి కార్యాలయం

◆ వాటర్ ట్యాంకర్ల సంఖ్యను పెంచాం

హఫీజ్‌పేట్ 17వ డివిజన్‌లో 33 ట్యాంకర్లు ఉండగా ఇప్పుడు 55 ఉన్నాయి. అదే దుర్గం చెరువు 15వ డివిజన్‌లో 140 నుంచి 224కు పెంచాం. వేసవి కాలం ప్రారంభ రోజుల్లోనే రెండింతల బుకింగ్‌లు వస్తున్నాయి. మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, కొండాపూర్ ఏరియాలలో ట్యాంకర్ల బుకింగ్ అధికంగా ఉంది. గత నెలలోనే భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ప్రైవేట్ బోర్లలో నీరు తగ్గినప్పుడు తాగునీటి ట్యాంకర్ల బుకింగ్‌లు ఎక్కువగా వస్తున్నాయి. దానికి అనుగుణంగా వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లు పెంచాం. ప్రజలు కూడా అధికారులకు సహకరించాలి. మంచినీటి ట్యాంకర్ కోసం 155313 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

పటాన్‌చెరు టౌన్: కరాటే పోటీల్లో పటాన్‌చెరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆదివారం హైదరాబాద్, మేడ్చల్ సుమంగళి గార్డెన్‌లో జరిగిన 3వ నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ 2025 పోటీల్లో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కరాటే ఛాంపియన్ షిప్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 8 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఆరుగురు స్వర్ణ పతకాలు సాధించగా, మరో ఇద్దరు కాంస్య పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రేమ్‌శంకర్ సోమవారం తెలిపారు. విద్యార్థులు, కరాటే కోచ్ కొమురయ్యను స్కూల్ ప్రిన్సిపాల్, అధ్యాపకుల బృందం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం రాజగోపాల్ యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్‌కాలనీలో నాలాలో పూడికతీత పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొనిపోయి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. లింగంపల్లి నుంచి ఇసుకబావి వరకు నాలాలోని చెత్తను తొలగించనున్నట్లు తెలిపారు. ప్రజలు నాలాలో చెత్త వేయొద్దని సూచించారు.

అక్రమ నిర్మాణంపై కొరడా



జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీలోని కాజీపల్లి గ్రామ శివారు జర్నలిస్టు కాలనీలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టింది. గ్రామానికి చెందిన కొందరు ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాష్ నారాయణ జేసీబీతో నేలమట్టం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది కాలనీవాసులు పాల్గొన్నారు.

రైతులు మోతాదుకు మించి మందులు వాడొద్దు



శిక్షణలో వివిధ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు

ఏజీవర్సిటీ: రైతులు మోతాదుకు మించి పురుగుల నివారణ మందులు వాడొద్దని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ విద్యాసాగర్ పేర్కొన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ కమ్యూనిటీ సైన్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్ సెంటర్‌లో 'మానసిక, పోషకాహార నాణ్యత, వ్యక్తి వికాసంపై ఉండే ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన శిక్షణ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. కలుషిత ఆహార పదార్థాలు, కూరగాయలు తినడం వల్లే మనిషి అనారోగ్యానికి గురవుతున్నాడని, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. మారుతున్న పరిస్థితుల వల్ల ప్రతి ఇంటిలోనూ మానసిక సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాల బోధనా సిబ్బంది పాల్గొనగా వారందరికీ పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్లానింగ్ సెల్ డైరెక్టర్ టి శశికళ, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ విజయలక్ష్మి, టి సుప్రజ, పి శ్రీదేవి, జానకి, శ్రీనాథ్, స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం మాట్లాడుతూ.. 'గుడ్ మార్నింగ్ మణికొండ' పేరిట పలు కాలనీల్లో కార్యక్రమం నిర్వహించి పలు సమస్యలను గుర్తించామన్నారు. పుప్పాలగూడ శ్మశానవాటికకు రోడ్డు, అంబేడ్కర్ భవన నిర్మాణం, శ్మశాన వాటికల ఏర్పాటు, మారుతీనగర్ రోడ్డు ఆక్రమణ, రెడీమిక్స్ వాహనాలు తిరగడంతో పాడైన రోడ్లు, నెమలినగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, శానిటేషన్ కార్మికులకు ఏడాదిలో 15 రోజుల సెలవులు ఇవ్వాలని, అలాగే వీధి కుక్కలకు షెల్టర్ హోం నిర్మించాలని కోరామన్నారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు ఎ.లక్ష్మణ్‌రావు, బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి, కె. రాఘవ రెడ్డి, దిలీప్‌కుమార్, యాలాల కిరణ్, సుమ నళిని తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చారిత్రక ముందడుగు

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రంలోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ సోమవారం రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం చారిత్రక ముందడుగేనని ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఇది రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా సామాజిక న్యాయాన్ని సాధించేందుకు పోరాటం చేస్తున్న అన్ని బీసీ సంఘాల విజయమన్నారు. బీసీల హక్కుల కోసం కృషి చేస్తున్న వారందరికీ ఇది గర్వకారణమన్నారు.

ప్రజాపాలనకు నిదర్శనం ప్రజావాణి



కార్యక్రమంలో జీఎం బ్రిజేష్‌తో పాల్గొన్న కాంగ్రెస్ నేత జగదీశ్వర్ గౌడ్

చందానగర్: ప్రజాపాలనకు నిదర్శనం ప్రజావాణి కార్యక్రమమని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ జలమండలి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దుర్గం చెరువు డివిజన్ జనరల్ మేనేజర్ బ్రిజేష్‌తో ఆయన పాల్గొన్న సమస్యల ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి భారీగా తరలిస్తున్న ప్రజలకు సత్వరమే సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీ, ఏ,బీ,సీ బ్లాక్‌ల జేఏసీ ఆధ్వర్యంలో కాలనీలో ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని డిప్యూటీ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. వాటర్ ట్యాంకర్స్‌కు చాలా అసౌకర్యంగా ఉందని, ఫుట్‌పాత్ ఆక్రమణలను వెంటనే తొలగించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా కాలనీల అసోసియేషన్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఆలయ హుండీ లెక్కింపు

ఆల్విన్‌కాలనీ: నిజాంపేట్ రోడ్డు, సెవెన్ హిల్స్ పక్కన ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు శ్రీవారి పరకామణి సేవ (హుండీ లెక్కింపు) నిర్వహించనున్నారు. ఈ హుండీ లెక్కింపులో భక్తులు పాల్గొనవచ్చునని కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణ తెలిపారు.

ఆస్తిపన్ను వసూళ్లపై సమీక్ష

రాజేంద్రనగర్: ఆస్తిపన్ను వసూళ్లపై రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్ సోమవారం సాయంత్రం ఏఎంసీ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నోటీసులు అందించిన వారి వద్దకు వెళ్లి ఆస్తి పన్ను వసూలు చేయాలన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట



రైతులతో మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలో విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పొలంబాట కార్యక్రమానికి హాజరయ్యారు. మండలంలోని నల్తూరు, కొర్రకుంట, కిష్టయ్యపల్లి గ్రామాల్లోని రైతులతో మాట్లాడారు. విద్యుత్ శాఖ ఏడీఈ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటర్లు అమర్చుకోవాలని తద్వారా బోరు మోటార్లు కాలిపోవని చెప్పారు. రైతులు క్షేత్రస్థాయిలో ఏమైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే తక్షణమే సిబ్బందికి లేదా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులకు విద్యుత్ సిబ్బంది స్నేహపూర్వకమైన సేవలను అందించేందుకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ వెంకటేశ్వర్లు, లైన్‌మేన్, రైతులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో దీక్షలు



నిరసన దీక్షలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చే వరకు గ్రూప్ 1, 2, 3 వంటి పరీక్షల ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఎంఆర్‌పీఎస్ శేరిలింగంపల్లి మండల ఇంచార్జి గణేష్ మాదిగ మాట్లాడుతూ మాల ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వం మాదిగలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. వర్గీకరణ బిల్లు చట్టం రూపం దాల్చేవరకు ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షులు నరేష్ మాదిగ, ఉపాధ్యక్షులు వినోద్ మాదిగ, నానక్‌రాంగూడ అధ్యక్షులు రాజు మాదిగ, నాయకులు సాయి, పింటు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులు రాణించేలా ఏఐ

- విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి



ఏఐ ల్యాబ్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి

పటాన్‌చెరు టౌన్: చదువులో వెనుకబడిన విద్యార్థులు కూడా కృత్రిమ మేధ ద్వారా రాణించేలా ఏఐను ఇంకా మెరుగుపరిచే అంశాలను పరిశీలిస్తున్నామని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి ముత్తంగి జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలను సోమవారం పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఏఐ ల్యాబ్ విద్యార్థులకు ఏ విధంగా ఉపయోగపడుతుందో స్వయంగా చూసి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు దీనిపై ఎంత అవగాహన ఉందో అని అడిగి తెలుసుకున్నారు. దీనిపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామన్నారు.

డంపింగ్ యార్డ్ ఏర్పాటును విరమించుకోండి



రఘు ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న రైతులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసనలు 41 రోజులకు చేరాయి. గుమ్మడిదల, ప్యారానగర్, నల్లవల్లి గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు శాంతియుతంగా కొనసాగుతున్నాయి. నిరాహార దీక్షలకు రోజురోజుకు స్థానికంగా మద్దతు పెరుగుతోంది. రైతులు, మహిళలు, విద్యార్థులు, వ్యాపారస్తులు అని తేడా లేకుండా ప్రతీ ఒక్కరు రిలే నిరాహార దీక్షలో భాగస్వామ్యమవుతున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల రైతులు ప్రజలు సోమవారం జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్‌ను కలిసి డంపింగ్‌యార్డ్ ఏర్పాట్లు రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ...వ్యవసాయ ఆధారిత ప్రాంతాన్ని స్థానిక ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటును విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు విరమించే వరకు జేఏసీ తరపున పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, సురేష్, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మణికొండ: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గండిపేట తహసీల్దార్ ఎన్. శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, ప్రమోషన్లు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు శంకరమ్మ, రుక్మిణి, సులోచన, అనిత పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు శుభపరిణామం

ఏజీవర్సిటీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టడం శుభ పరిణామమని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి ఎం దశరథ్ అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ బిల్లుకు బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు మద్దతు తెలపడం హర్షణీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

నానో మెటీరియల్స్‌పై శిక్షణ ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్, గ్లోబల్ ఇనిషియేటివ్ ఆఫ్ అకడమిక్ నెట్ వర్క్ ఆధ్వర్యంలో 'రసాయన, బయో సెన్సార్లలో నానో మెటీరియల్స్' అనే అంశంపై ఐదు రోజుల పాటు ప్రత్యేక కోర్సును నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని సోమవారం వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయూహెచ్‌లో అత్యాధునిక పరిశోధన ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయన్నారు. 'ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో సిద్ధాంతం (థియరీ)తో పాటు ప్రయోగాత్మక శిక్షణ (ప్రాక్టికల్) కూడా అందించటం ద్వారా విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగుపరిచే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. భిన్న రంగాల్లో పరిశోధనలు చేయడానికి వెనుకాడకూడదన్నారు. తాను మెకానికల్ ఇంజినీరింగ్ చదివి, ఆ తర్వాత అమెరికాలో ఎన్ఏఎస్ఏ ప్రాజెక్టులో ఆర్గానిక్ కెమిస్ట్రీలో పరిశోధనలు చేసిన అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. మల్టీడిసిప్లినరీ విధానం అనుసరించడం ద్వారా విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించగలరన్నారు. అనంతరం అమెరికాలోని ఎలిజబెత్ సిటీ స్టేట్ యూనివర్సిటీకి చెందిన డా. బిజేంద్ర కుమార్ నానో టెక్నాలజీ మౌలిక సూత్రాలు, గ్రాఫీన్, కార్బన్ నానోట్యూబ్ వంటి అధునాతన పదార్థాలు, బయోసెన్సింగ్ రంగాలలో వాటి వినియోగాలను వివరించారు. కార్యక్రమంలో రెక్టార్ డా. విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. నరసింహారెడ్డి, జిఐఎన్ లోకల్‌కోఆర్డినేటర్ డా. హేమలత పాల్గొన్నారు.

నేలను కాపాడుకుంటేనే ఆరోగ్యం

ఏజీవర్సిటీ: నేలను కాపాడుకుంటేనే మనుషులు ఆరోగ్యంగా ఉంటారని, అలాగే మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని అమెరికాలోని ఆబర్న్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎంఎస్ రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 'దక్కన్ సొసైటీ ఆఫ్ ప్లాంట్ పెథాలజిస్ట్' ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 'నూతన సుస్థిర వ్యవసాయం పద్ధతులు, నేలల ఆరోగ్యం' అనే అంశంపై మాట్లాడారు. భూమిలో ఉండే సేంద్రియ కార్బన్ తో పాటు మేలు చేసే సూక్ష్మజీవుల సంతతి పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం దక్కన్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంఎస్ రెడ్డిని ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో డీన్ అఫ్ అగ్రికల్చర్ డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ రాములు, డీన్ నరేందర్ రెడ్డి, ప్లాంట్ పెథాలజిస్ట్ విద్యాసాగర్, శాస్త్రవేత్తలు త్రివేణి తదితరులు పాల్గొన్నారు.